న్యూ ఇయర్‌కు డ్రగ్స్ పెడ్లర్ల నయా స్కెచ్

ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటే టార్గెట్.. ఈజీగా డ్రగ్స్ విక్రయించే ప్లాన్

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): డ్రగ్ సప్లయర్స్ తమ వ్యాపారాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు కొత్త దారులు ఎంచుకుంటున్నారు. నూతన సంవత్సర వేడుకులు దగ్గర పడుతుండటంతో ముంబై, గోవా, బెంగళూర్ నుంచి డ్రగ్స్ హైదరాబాద్‌కు సరఫరా చేసేందుకు డ్రగ్స్ స్మగ్లర్లు వివిధ రకాలుగా ప్రయత్నిస్తుండగా, వాటిని కష్టమర్లకు విక్రయించి లాభాలు పొందేందుకు డ్రగ్స్ పెడ్లర్స్ యత్నిస్తున్నారు. తాజాగా ఎల్‌జీబీటీక్యూ(లెస్‌బియాన్స్, గే, బైసెక్స్‌వల్, ట్రాన్స్ జెండర్, క్వీర్) కమ్యూనిటీని టార్గెట్ చేస్తూ డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నిస్తూ ఓ డ్రగ్స్ పెడ్లర్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో ఈ విషయంపై వెలుగులోకి వచ్చింది. ఈ కమ్యూనిటీకి డ్రగ్ విక్రయం ఎవరికి అనుమానం రాదనే భావనతో డ్రగ్ పెడ్లర్స్ కొత్త రూట్లలో హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా నిర్వహిస్తున్నారు. ఆయా గ్రూప్‌లలో కొందరిని పరిచయం చేసుకుంటూ ఆ కమ్యూనిటీకి ఈ డ్రగ్ పెడ్లర్స్ దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. సాధారణ ప్రజలకు డ్రగ్స్ విక్రయించాలంటే పబ్‌లు, బార్లు, వివిధ రకాలైన ఈవెంట్స్ జరిగే సమయంలో అక్కడికి వచ్చే వారిని పరిచయం చేసుకుంటూ తమ వద్ద ఉన్న డ్రగ్స్ విక్రయించాలి. పరిచయం ఉన్న వారి ద్వారా కొత్తవారికి విక్రయిస్తుంటారు. డ్రగ్ విక్రయాలపై దేశ వ్యాప్తంగా పోలీసుల నిఘా పెరిగింది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీసులు నిఘా పెంచారు.

గిరాకీ ఎక్కువగా ఉండటంతో..

నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీ చేసుకోవడానికి వేడుకలు నిర్వహించుకుంటారు. ఆయా వేడుకల్లో డ్రగ్స్ పార్టీలు కూడా జరిగే అవకాశాలుంటాయి. ఈ విషయాలపై పోలీసులు అంతగా ఫోకస్ చేయరు. దీంతో డ్రగ్స్ విక్రయానికి అనువైన ప్రాంతంగా డ్రగ్స్ పెడ్లర్స్ భావిస్తూ ఆ మేరకు తమ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ముంబై, గోవా, బెంగళూర్ వంటి ప్రాంతాల్లో ఉండే ఈ గ్రూప్‌లకు డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలు తాజాగా హైదరాబాద్‌లో ఉండే ముఠాలకు కూడా ఈ ప్లాన్‌లు వివరిస్తున్నట్లు సమాచారం. ఈ గ్రూప్‌లు ఒక్కొక్కటి ప్రత్యేక గ్రూప్‌లుగా ఉండటం, కొన్ని కలిసి ఉండటం, మొత్తం ఒక గ్రూప్‌గా ఉంటూ సమాచారాన్ని మార్పిడి చేసుకుంటుంటారు. న్యూ ఇయర్ వేడుకలకు సంబంధించిన డ్రగ్స్ కావాలంటే ఇప్పటి నుంచి ప్రణాళికలతో ముందుకు సాగాలని ఇరు వర్గాలు భావిస్తుంటాయి. ఇంకా ఒకటి రెండు రోజులు అయ్యిందంటే పోలీసుల నిఘా మరింతగా పెరుగుతుందనే భావన వారిలో ఉన్నది. తాజాగా టీన్యాబ్, నాంపల్లి పోలీసులు ఎండీఎంఏ డ్రగ్స్‌ను ముంబై నుంచి తెచ్చి ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీకి విక్రయించేందుకు ప్రయత్నిస్తూ అమీర్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ఈ కేసును లోతైన దర్యాప్తు జరిపితే ఈ వ్యవహారంలో మరింత సమాచారం వస్తుందని పోలీసులు భావిస్తున్నారు.

స్నేహితుడని నమ్మితే.. స్నాచింగ్ నేర్పాడు..

చైన్‌స్నాచింగ్.. ఇద్దరి రిమాండ్
చైన్, వాహనాలు, ఫోన్లు స్వాధీనం
వివరాలు వెల్లడించిన ఏసీపీ రాములు

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాములు, సీఐ శ్రీనాథ్, డీఐ, సీసీఎస్ సీఐ

శామీర్‌పేట, డిసెంబర్ 20 : వారిద్దరూ డ్రైవర్లుగా పరిచయమై.. అది కాస్తా స్నేహంగా మారింది. కారు ఓనర్‌గా మారిన అనతికాలంలోనే డ్రైవర్(స్నేహితుడు) మాటలు నమ్మాడు. చెప్పుడు మాటలు నమ్మి చెడు పనులు చేస్తూ కటకటాల పాలయ్యాడు. ఈ సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పేట్‌బషీర్‌బాగ్ ఏసీపీ రాములు వివరాలు వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన నూనె అంజిరెడ్డి డ్రైవర్‌గా పని చేస్తూ కీసర మండలం బండ్లగూడలో నివాసం ఉంటున్నాడు. ఐటీ కంపెనీలో క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్న సమయంలో బోడుప్పల్‌కు చెందిన నరేందర్‌రెడ్డి అలియాస్ నవీన్‌రెడ్డి క్యాబ్ డ్రైవర్‌తో పరిచయం ఏర్పడింది. వారిద్దరి మధ్య స్నేహంతో నరేందర్‌రెడ్డి కారు కొనుగోలు చేసిన తర్వాత తన కారుకు అంజిరెడ్డిని డ్రైవర్‌గా పెట్టుకున్నాడు. ఇప్పటికే పాత నేరస్తుడు అయిన అంజిరెడ్డి పూర్తి వివరాలు తెలియకపోయినా స్నేహానికి విలువనిచ్చాడు. అధిక సంపాదన లక్ష్యంగా చెప్పుడు మాటలను నమ్మాడు.. దీంతో చైన్‌స్నాచింగ్‌కు పథకం వేశారు. కారులో రెక్కీ నిర్వహించిన వీరు అదును కోసం వేచి చూశారు. కారులో రెక్కీ నిర్వహించి పథకాన్ని సిద్ధం చేసుకున్నారు. ఈనెల 10వ తేదీన మూడుచింతలపల్లిలో హరిహర దేవాలయం సమీపంలో వడ్లు ఎండపోసేందుకు గ్రామానికి చెందిన వృద్ధురాలు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలో నుంచి చైన్‌స్నాచింగ్ చేశారు. వృద్ధురాలు ప్రతిగటించడంతో దాదాపు పావు తులం బంగారు చైన్‌తో పారిపోయారు. బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసును ఛాలెంజ్‌గా తీసుకున్నారు. సీఐ శ్రీనాథ్, డీఐ గంగాధర్ ఆధ్వర్యంలో టీమ్స్‌గా ఏర్పడ్డారు. సీసీఎస్ పోలీసులతో కలిసి జల్లడ పడుతూ దాదాపు 70 కిలోమీటర్ల మేర 600లకు పైగా సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితులు చిక్కకపోవడంతో గాలింపులు కొనసాగించారు. ఈ క్రమంలో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం అనుమానాస్పదంగా సంచరిస్తున్న విషయాన్ని గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా.. వారు చేసిన నేరాన్ని ఒప్పుకోవడంతో పావులెత్తు బంగారు చైన్(ముక్క)తోపాటు రెండు సెల్‌ఫోన్లు, ఒక స్కూటీ, ఒక కారు(రెక్కీ నిర్వహించిన)ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనాథ్, డీఐ గంగాధర్, సీసీఎస్ సీఐ నాయుడు, ఎస్‌ఐలు హారిక, దరశథ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగులే లక్ష్యంగా.. ఆన్‌లైన్‌లో గంజాయి

ఐకియా వాహనాల్లో రవాణా.. ఇద్దరి అరెస్ట్

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): ఐటీ ఉద్యోగులే లక్ష్యంగా ఆన్‌లైన్ ద్వారా సరఫరా చేస్తున్న గంజాయిని ప్రముఖ ఫర్నిచర్ సంస్థ ఐకియాకు చెందిన ట్రాన్స్‌పోర్ట్ వాహనాల్లో రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 1.12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ ప్రాంతానికి చెందిన చితారి మహేశ్, డి.సిద్ధులు నగరంలోని ప్రముఖ ఫర్నిచర్ సంస్థ ఐక్యాలో డ్రైవర్‌లుగా పనిచేస్తున్నారు. గచ్చిబౌలి ప్రాంతంలో ఐటీ ఉద్యోగులతో పరిచయాలు ఏర్పడ్డాయి. సదరు ఉద్యోగులు స్నాప్‌చాట్ వంటి యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో 'జాయింట్', 'కోర్', 'గ్రీన్' వంటి కోడ్ భాషలతో గంజాయిని బుక్ చేసుకుంటారు. దీంతో ఆన్‌లైన్ సరఫరాదారులు స్నాప్‌చాట్ ద్వారా ఐకియాలో పనిచేసే డ్రైవర్లు చితారి మహేశ్, సిద్ధులకు ఎక్కడికి రావాలో సమాచారం అందిస్తారు. అమ్మకందారుల సూచన మేరకు ఐకియా డ్రైవర్లు అక్కడికి వెళ్లి గ్రాము గంజాయి ప్యాకెట్‌ను రూ.300 చొప్పున కొనుగోలు చేస్తారు. వాటిని ఐకియా వాహనంలో డ్రైవింగ్ సీటు కింద పెట్టుకుని నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ ప్రాంతాల్లో పరిచయమున్న ఐటీ ఉద్యోగులకు రూ.500 చొప్పున విక్రయిస్తారు. అబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు గచ్చిబౌలి, టెలికామ్‌నగర్ పార్క్ వద్ద శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఐకియా వాహనంలో 1.2కిలోల గంజాయి లభించింది. నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రూ.1.12కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్‌ఐ జ్యోతి, హెడ్‌కానిస్టేబుల్ అలీమ్, కానిస్టేబుళ్లు లేఖసింగ్, కార్తిక్, రాంచందర్ ఉన్నారు.

గంజాయి విక్రయం.. ముగ్గురి అరెస్ట్

ఆదిలాబాద్ కేంద్రంగా ధూల్‌పేట మచిలీపురా ప్రాంతానికి చెందిన ఇందర్‌పాల్‌సింగ్ ఆదిలాబాద్ నుంచి ధూల్‌పేటకు గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. ఎస్‌టీఎఫ్ పోలీసులు శుక్రవారం ఇందర్‌పాల్ సింగ్ ఇంటిపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఇందర్‌పాల్‌సింగ్‌తోపాటు కపూర్‌సింగ్‌ను అరెస్టు చేసి, 8.6కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సబల్‌కరమ్‌పై కేసు నమోదు చేశారు. మరో కేసులో గంజాయి విక్రయిస్తున్న కునాల్‌సింగ్‌ను అరెస్టు చేయగా, గంజాయి వినియోగిస్తున్న మహేశ్‌తో పాటు మరో 10 మందిపై కేసులు నమోదు చేశారు. పట్టుకున్న వారిలో ఎస్‌టీఎఫ్ సీఐ మధుబాబు, గోపాల్, ఎస్‌ఐలు భాస్కర్‌గౌడ్, లలిత, మహేశ్వర్, సైదులు, హెడ్‌కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి, అజీమ్, శ్రీధర్, కానిస్టేబుళ్లు ప్రకాశ్, రాకేశ్, మహేశ్ పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో రూ.28 లక్షలు మోసం

జర్నలిస్టుపై చీటింగ్ కేసు

బంజారాహిల్స్, డిసెంబర్ 20:ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఓ మహిళపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. అల్వాల్‌లో నివాసం ఉంటున్న పి.సుజాత యాదవ్ అనే మహిళ హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా పని చేస్తుంటారు. ఆమెకు కామన్ ఫ్రెండ్స్ ద్వారా బంజారాహిల్స్ రోడ్ నం.2లోని సాగర్ సొసైటీలోని 'వీ-5 చానెల్'లో జర్నలిస్టుగా పనిచేసే డీఎస్.కవిత అనే మహిళ పరిచయమైంది. తనకున్న పరిచయాలను ఉపయోగించి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించింది. సుజాత యాదవ్‌తో పాటు మరికొంత మంది వద్ద నుంచి సుమారు రూ.28లక్షల వరకు వసూలు చేసిన కవిత ముఖం చాటేసింది. తమ ఫోన్లు ఎత్తడంలేదని, డబ్బులు ఇవ్వడంలేదని బాధితురాలు సుజాత బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగమంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్.. రూ.24.5లక్షలు..

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ):కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగాలంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ ప్రకటనకు స్పందించిన ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.24.5లక్షలు పోగొట్టుకున్నాడు. శాలిబండకు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూస్తుండగా.. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌ఆర్‌సీఎస్ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్)లో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ప్రకటన కన్పించింది. వెంటనే దానిని క్లిక్ చేయగా.. రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటూ ఓ మెసేజ్ వచ్చింది. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి అందులో రిజిస్ట్రేషన్ చేసుకున్న తరువాత అవతలి నుంచి ఫోన్ వచ్చింది. 'మీరు ఉద్యోగానికి అర్హత సాధించారు. అయితే ఫలానా ఫీజు, ట్యాక్స్‌లు చెల్లించండంటూ దఫదఫాలుగా ఫోన్లు, మెసేజ్‌లు చేస్తూ రూ.24.5లక్షలు కాజేశారు. ఈ మేరకు ఓ ఆఫర్ లెటర్‌ను సైతం పంపించారు. దానిని పరిశీలించగా.. అది ఫేక్ అని తేలింది. దీంతో ఇదంతా మోసమని గ్రహించిన బాధితుడు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

శంషాబాద్‌లో జైన్ ప్రముఖ్ సమృద్ధి టవర్స్

సిటీబ్యూరో, డిసెంబరు 20(నమస్తే తెలంగాణ): శంషాబాద్‌లోని సాతంరాయిలో జైన్ ప్రముఖ్ సమృద్ధి టవర్స్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రాజెక్ట్ ప్రతినిధులు శుక్రవారం వెల్లడించారు. లగ్జరీ నివాసయోగ్యమైన ఈ ప్రాజెక్ట్ ఐశ్వర్యం, సౌలభ్యం, స్థిరత్వానికి సమలతుల్యంగా రూపొందించడం జరిగిందని, ఈ ప్రాజెక్ట్ జైన సంస్కృతి సంప్రదాయ నిర్మాణాలకు చిహ్నమని ప్రాజెక్ట్ ప్రతినిధులు తెలిపారు. మూడు మెజెస్టిక్ టవర్స్‌తో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో ప్రతి టవర్ 27అంతస్తులు ఉంటుందని, అందులో 3, 4, 5 బీహెచ్‌కే నివాసాలు ఉంటాయని వివరించారు. ఈ టవర్స్‌కు ఆర్జీఐ ఎయిర్ పోర్టు నుంచి పది నిమిషాల ప్రయాణంలోనే చేరుకునే సౌలభ్యం ఉన్నదని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పిల్లలు ఆడుకునేందుకు అందమైన ల్యాండ్ స్కేప్ మైదానాలు, గార్డెన్స్, ఆడుకునే వస్తు సముదాయంతో నిర్మితమై ఉంటున్నదన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

అక్కడికక్కడే ఒకరి మృతి, మరొకరికి గాయాలు

ఖైరతాబాద్, డిసెంబర్ 20: పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో హిట్ అండ్ రన్ ఘటన జరిగింది. ద్విచక్ర వాహన్ని ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టగా విద్యార్థి మృతి చెందాడు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ బస్సుతో పరారయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. విద్యానగర్‌కు చెందిన పున్నం లోకేశ్(20) ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. తన ద్విచక్ర వాహనంపై మరో స్నేహితుడితో కలిసి పంజాగుట్ట నుంచి అమీర్‌పేట మీదుగా వెళ్తుండగా, రిలయన్స్ స్మార్ట్ బజార్ వద్ద వెనుక వైపు నుంచి అతి వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోకేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, అతడి స్నేహితుడికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ బస్సుతో పరారయ్యాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు.

ఎల్బీస్టేడియంలో క్రిస్మస్.. ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): ఎల్బీ స్టేడియంలో శనివారం సాయంత్రం ప్రభుత్వం నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో స్టేడియం పరిసరాల్లో సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు, పరిసరాల్లో ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ ఎక్కువగా నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు..

ఏఆర్ పెట్రోల్ పంప్ జంక్షన్ నుంచి బీజేఆర్ విగ్రహం వైపు వాహనాలకు అనుమతులుండవు. పంప్ వద్ద నుంచి నాంపల్లి రైల్వేస్టేషన్-రవీంద్రభారతి వైపు మళ్లిస్తారు. బషీర్‌బాగ్ నుంచి ఏఆర్ పెట్రోల్ పంపు వైపు వాహనాలకు అనుమతి లేదు. బీజేఆర్ విగ్రహం నుంచి ఎస్‌బీఐ, గన్‌ఫౌండ్రీ వైపు ఈ వాహనాలను మళ్లిస్తారు. సుజాత స్కూల్ లేన్ నుంచి ఖాన్ లతీఫ్ ఖాన్ బిల్డింగ్ వైపు వాహనాలకు అనుమతి లేదు. ఈ వాహనాలను సుజాత స్కూల్ జంక్షన్ నుంచి నాంపల్లి వైపు మళ్లిస్తారు.

చోరీ కేసు నిందితుడి అరెస్ట్

ఆభరణాలు స్వాధీనం

జగద్గిరిగుట్ట, డిసెంబర్ 20: ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డ కేసులో ఓ నిందితుడ్ని అరెస్ట్ చేశారు. శుక్రవారం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఏసీపీ హన్మంతరావు వివరాలు వెల్లడించారు. అల్విన్‌కాలనీ వెస్ట్‌సాయినగర్ నివాసముండే పరమేశ్ కుటుంబం ఈనెల 15వ తేదీన జనగామ జిల్లాకు వెళ్లి తిరిగి 18వ తేదీన వచ్చారు. దీంతో ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు బీరువా పగులగొట్టి 13 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఆధారాలతో నిందితుడు నాడ్గొట్టి భరత్(23)ను అరెస్ట్ చేసి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. బాధిత కుటుంబానికి భరత్ దూరపు బంధువు కావడంతో ఇంట్లో ఎవరూలేని సమయం చూసి చోరీకి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు చనిపోగా జులాయిగా తిరిగే నిందితుడు సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీల బాటపట్టాడు. గతంలో చార్మినార్, మేడిపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సిబ్బందిని ఏసీపీ అభినందించారు. సీఐ నర్సింహా, డీఐ అంజయ్య, ఎస్‌ఐ రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సిటీలో ఐదుగురి సీఐల బదిలీ

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ):హైదరాబాద్‌లో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. కుల్సుంపురా డీఐగా తాత్కాలికంగా అటాచ్‌లో ఉన్న డీఐ నాగేంద్రప్రసాద్‌వర్మ కుచర్లపాటిని ఛత్రినాక ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఊట్కూర్‌ను సౌత్‌జోన్ కంట్రోల్‌రూమ్‌కు బదిలీ చేశారు. ఛత్రినాక డీఐగా పనిచేస్తున్న నడిపాటి రామును సాహినాయథ్‌గంజ్ డీఐగా, అక్కడ పనిచేస్తున్న చనగోని శోభన్ బాబును ఛత్రినాక డీఐగా బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న మద్దికుంట వరప్రసాద్‌ను కుల్సుంపుర డీఐగా అటాచ్ చేశారు.

ఏఐతో ఫేక్ డీపీ.. విద్యార్థినికి బెదిరింపులు

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)ను వాడుతూ సైబర్‌నేరగాళ్లు కొత్త ఎత్తులతో మోసాలు, బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థినికి నకిలీ డీపీతో నగ్న ఫొటోలు పెట్టి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడ్డ ఘటనపై సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు యూపీకి చెందినవాడిగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. బాధితురాలి ఇన్‌స్టాగ్రామ్‌కు గుర్తుతెలియని వ్యక్తి మెసేజ్ పంపించడంతో ఆమె స్పందించి అనుమానాస్పదంగా ఉండటంతో పక్కన పెట్టేసింది. అయితే సైబర్‌నేరగాడు బాధితురాలి ఇన్‌స్టా ఐడీని, డీపీతోపాటు స్క్రీన్ షాట్ తీసి ఆ ఫొటోను ఏఐ టూల్స్ వాడి మార్ఫింగ్ చేశాడు. ఆ నకిలీ డీపీని వాడుతూ బాధితురాలిని బ్లాక్‌మెయిలింగ్ చేయడం మొదలుపెట్టాడు. నేను చెప్పినట్లు చేయకపోతే ఈ నగ్న ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తానంటూ బెదిరించడం మొదలుపెట్టాడు. బాధితురాలు ఆ ఐడీని బ్లాక్ చేయడంతో ఆమె కుటుంబసభ్యులకు అతడు మెసేజ్ చేస్తూ బెదిరించాడు. దీంతో బాధితులు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యూపీ, మీరట్ నుంచి ఈ మెసేజ్ వచ్చినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అధిక రాబడి పేరుతో రూ.3.1 కోట్ల శఠగోపం

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): తమ కంపెనీలో పెట్టుబడులు పెడితే అధిక రాబడి వస్తుందని నమ్మించి 9 మంది వద్ద నుంచి రూ.3.1కోట్లు వసూలు చేసి, బిచ్చాణ ఎత్తేసిన దంపతులిద్దరిని సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేశారు. ఈఓడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ కథనం ప్రకారం... కొండాపూర్ ప్రాంతానికి చెందిన ముగులూరి చంద్రారెడ్డి, అరుణకుమారి దంపతులు 'గాయత్రీ ఇన్‌ఫ్రా డెవలపర్స్' పేరుతో సంగారెడ్డిలో ఒక సంస్థను ప్రారంభించారు. బుయ్ బ్యాక్ స్కీమ్ పేరుతో అమాయక జనాలను ఆకర్శించిన దంపతులు తమ ప్రాజెక్ట్‌లో పెట్టుబడులు పెడితే సుమారు 1600 చ.అడుగుల ప్లాట్‌ను గానీ, రూ.1.6కోట్ల నగదు గానీ అందజేస్తామని నమ్మించారు. అంతేగాకుండా నిందితులు ఎంఓయూ, సేల్‌డీడ్ పోస్టు డేటెడ్ చెక్స్, నగదు చెల్లింపులకు సంబంధించిన రసీదులు సైతం ఇచ్చారు. ఈ క్రమంలో దాదాపు 9 మంది వద్ద నుంచి డబ్బులు వసూలు చేసిన తరువాత కొన్ని రోజులపాటు కొంత డబ్బును చెల్లించిన నిందితులు ఆ తరువాత బోర్డు తిప్పేశారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన జొన్నల శ్రీనివాసరెడ్డి ఈఓడబ్ల్యూ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి అమాయక ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసిన భార్యాభర్తలను శుక్రవారం అరెస్టు చేశారు.

భార్యను హత్య చేసిన భర్త

పోలీసులకు లొంగిపోయిన నిందితుడు

మణికొండ, డిసెంబర్ 20: ఓ కసాయి భర్త అతికిరాతకంగా కట్టుకున్న భార్యనే హతమార్చి పోలీసుల ముందు లొంగిపోయిన ఘటన శుక్రవారం కోకాపేటలో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో గత కొన్నేండ్లుగా నివాసముంటున్న సునీత, ముత్యాలు దంపతులిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా, గత కొన్నేండ్లుగా భార్య సునీతపై అనుమానం పెంచుకున్న ముత్యాలు నిత్యం మద్యం తాగి ఆమెను అనేక రకాలుగా వేధింపులకు గురిచేసేవాడు. గత ఆరు నెలల కిందటే సునీతపై కర్రతో దాడి చేయడంతో ఆసుపత్రి పాలైయ్యింది. కాగా, శుక్రవారం ఉదయం ఇంట్లో ఉన్న సునీత గొంతును కత్తితో కోసి హత్య చేశాడు. అనంతరం చుట్టుపక్కల వారికి తెలిసేలా తాను తన భార్యను హత్య చేశానంటూ గొప్పగా చెప్పుకుంటూ నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. గతంలోనూ నిందితుడికి మరో యువతితో వివాహం జరుగగా, అతడి వేధింపులు భరించలేక ఆమె వదిలేసినట్లు స్థానికులు తెలిపారు. సునీతను రెండో పెండ్లి చేసుకుని వేధింపులతోనే ఆమె ప్రాణాలను తీశాడంటూ కుటుంబసభ్యులు చెప్పారు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PEST CONTROL

★ARG పెస్ట్ కంట్రోల్, సల్ఫస్, చెదలు 2BHK 2,000/-, 3BHK 2,500/-, బొద్దింకలు జెల్ 599/- చీమలు, ఎలుకలు, నల్లులు, బల్లులు, న్యూ కన్‌స్ట్రక్షన్ 10 yrs. వారెంటీ. Ph: 9912808736.
NT-326609

BUSINESS OFFER

★Urgently need an investment of 7 lakhs in health care products. Monthly 25 k guaranteed income call 9959565385. Hyderabad
NT-337302

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739.
NT-326616

CHITS & DEPOSITS

★Regd. Chits: 5L, 10L, 15L, 20L, 25L, 50L & 1 Crore Chits. Commitment available. Contact: 8464919899.
NT-326882

INSURANCE

★స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో కొత్త పాలసీ కోసం ఫోన్ చేయండి లేదా ఏజెంట్‌గా చేరడానికి సంప్రదించండి. ఫోన్: 9000543747.
NT-337706

TRAINING

★ఫొటోషాప్ ఉపయోగించి ఆల్బం డిజైన్ చేయడం నేర్చుకోండి. మీ ఇంటివద్దనే ఉంటూ